క్లుప్తంగా

అమరవీరుల కుటుంబాలకు పెన్షన్ మంజూరు చేయాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న అమరవీరుల కుటుంబ సభ్యులు

జగిత్యాల: అమరవీరుల కుటుంబ సభ్యులకు పెన్షన్, సొంత ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు అమరవీరుల కుటుంబ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 589 మంది కుటుంబ సభ్యులకు రాష్ట్రం ఏర్పాటు చేసిన తర్వాత రూ.10 లక్షలు, ఆర్థిక సాయం ప్రభుత్వ ఉద్యోగం కల్పించిందని, అప్పటి ప్రభుత్వం ఇంతకు మించి లబ్ధి చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అమవీరుల కుటుంబాలకు రూ.25 వేల పెన్షన్, సొంత ఇల్లు ఇస్తామన్నారని, మంజూరు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్‌కుమార్, శారద పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండి సేవలందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మెట్‌పల్లి: రోగులకు అందుబాటులో ఉండి సేవలందించాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత వైద్యులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని శుక్రవారం అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చే ఓపీ, ఐపీ రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే కిచెన్‌ను పరిశీలించి.. నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను గురించి సిబ్బంది ఆమెకు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పంటపొలాలను ముంచెత్తిన గోదావరినది

మల్లాపూర్: భారీ వర్షాలతో మండలంలోని చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయి మత్తడి దుంకుతున్నాయి. శుక్రవారం ఎస్సారెస్పీ ప్రాజెక్టు 39 గేట్లు ఎత్తి 5.50లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో గోదావరినది తీర ప్రాంతాలు ప్రమాదకరంగా మారడంతో తహసీల్దార్ రమేశ్‌గౌడ్, ఎస్సై రాజు, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది కలిసి పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తీర ప్రాంతాల రెవెన్యూ, పంచాయతీ అధికారులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తు అంచనా వేయాలని ఆదేశించారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి: పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని కోరుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎస్‌తో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతోందని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చిన్నయ్య తదితరులున్నారు.

తాళ్ల చెరువు అభివృద్ధికి కృషి

కోరుట్ల: పట్టణంలోని తాళ్ల చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. తాళ్ల చెరువు ప్రాంతాన్ని శుక్రవారం సందర్శించి మాట్లాడారు. మాజీ మంత్రి రత్నాకర్ రావు హయాంలో చెరువు అభివృద్ధికి రూ.28 కోట్లతో ప్ర ణాళికలు రూపొందించారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెరువును నిర్లక్ష్యం చేసిందన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, టౌన్ ఉపాధ్యక్షుడు నయీం, మహిపాల్ రెడ్డి, సదానందాచారి పాల్గొన్నారు.

చెరువులకు జలకళ



రాళ్లవాగు ప్రాజెక్టు మత్తడి పైనుంచి పారుతున్న నీళ్లు



అలుగుపారుతున్న స్తంభం పల్లి చెరువు

కథలాపూర్/వెల్గటూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని పలు చెరువులకు జలకళ సంతరించుకుంది. కథలాపూర్ మండల శివారులో గల రాళ్లవాగు ప్రాజెక్టులో సమృద్ధిగా నీళ్లు చేరి మత్తడి దూకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లుంటే సుమారు 3,500 ఎకరాలకు నీరందుతుందని అధికారులు తెలిపారు. వెల్గటూర్ మండలంలో చెరువులు, కుంటల్లోకి వరద చేరి మత్తడి దూకుతున్నాయి. స్తంభంపల్లి పెద్ద చెరువు రెండేళ్ల తర్వాత మత్తడి దూకుతుండడంతో ఈ చెరువుపై ఆధారపడి వ్యవసాయం చేసుకునే మూడు గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాయికల్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రాయికల్ పట్టణంలోని మత్తడిపై ఉధృతంగా వర్షపునీరు ప్రవహిస్తోంది. సాయంత్రం వేళ పట్టణ ప్రజలు మత్తడిని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు.



రాయికల్: మత్తడిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

పొంగిపొర్లిన వాగులు, వంకలు



భారీగా ప్రవహిస్తున్న పెర్కపల్లి బొల్లెవాగు



రాయికల్ వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పెర్కపల్లి గ్రామ శివారులోని బొల్లెవాగు ఉధృతంగా ప్రవహించగా గుల్లపేటలోని వంతెన నుంచి భారీగా వరదనీరు రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

సారంగాపూర్: భారీ వర్షాలు, వరదలతో సారంగాపూర్, బీర్‌పూర్ మండల్లాని పలు గ్రామాల్లో రోడ్లు కంకర తేలి, గుంతలు ఏర్పడి చిద్రమై కనీసం నడవడానికి వీలులేకుండా మారాయి. మండలంలోని రంగపేట-రేచపల్లి గ్రామాల మధ్య తారు రోడ్డు వరదల కారణంగా దయనీయంగా మారింది. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని రేచపల్లి గ్రామస్తులు కోరారు.

భూపతిపూర్‌లో వరద ప్రాంతం పరిశీలన

రాయికల్: మండలంలోని భూపతిపూర్ 6,9,10 వార్డుల్లో వరద నీరు వచ్చి ఇళ్లలోకి చేరడంతో శుక్రవారం ఎంపీడీవో చిరంజీవి సందర్శించారు. అక్కడ కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కార్యదర్శి హరికృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్, స్థానిక నాయకులు ఉన్నారు.

పేరుకుపోయిన చెత్తాచెదారం

- మినీ డంపింగ్ యార్డుల్లా మారిన వీధులు
- దోమల నియంత్రణకు చర్యలు కరువు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



బైపాస్ రోడ్డు వద్ద పడేసిన చెత్త



బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం ప్రజలకు ముప్పుగా మారింది. స్థానికులు నిర్లక్ష్యంగా చెత్త పారేయడంతో ఆ ప్రదేశాలు మినీ డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. పేరుకున్న చెత్త కుప్పలు పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారాయి. దీంతో చిన్న పిల్లలు ఆ వీధుల గుండా ఒంటరిగా వెళుతున్నప్పుడు అవి దాడి చేసే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం పెరిగింది. గతంలో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్ మండల కేంద్రాన్ని సందర్శించినప్పుడు పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలని, చెత్తను తరచూ తొలగించాలని, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని, బ్లీచింగ్ పౌడర్ వాడాలని అధికారులకు ఆదేశించినా ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయలేదు. మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకులాలకు అధిక సీట్లు కేటాయించాలి



సోషల్ వెల్ఫేర్ కార్యదర్శితో సమావేశమైన ఎమ్మెల్యే

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో అధిక సీట్లు కేటాయించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కోరారు. ఈ మేరకు జగిత్యాల వచ్చిన రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల కార్యదర్శి అలుగు వర్షిణితో కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే శుక్రవారం సమావేశమయ్యారు. అధిక సీట్లు కేటాయించాలని వినతి పత్రం అందించారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వ విప్ పరామర్శ

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కాటిపెల్లి రాధ-శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. రెండు రోజుల క్రితం శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు శ్రీకర్ కెనాల్‌లో పడి గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం వారి ఇంటికి వెళ్లి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కుటుంబీకులను ఓదార్చారు. ఆయన వెంట కథలాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

గాయపడ్డ ఉద్యోగిని ఆదుకోవాలని డీఈకి వినతి

మెట్‌పల్లి: విధుల్లో తీవ్రంగా గాయపడ్డ విద్యుత్ శాఖ తాత్కాలిక ఉద్యోగి సాంబారి హరీశ్‌ను ఆదుకోవాలని అతని కుటుంబ సభ్యులు శుక్రవారం డీఈ మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత జూన్ 12న లైన్‌మెన్ ఫ్రాంక్లిన్ నిబంధనలకు విరుద్ధంగా హరీశ్‌తో స్తంభంపై పని చేయిస్తున్న సమయంలో జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. రెండు కాళ్లు చచ్చుపడిపోయి మంచానికే పరిమితమైన అతన్ని లైన్‌మెన్ గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భార్యతో పాటు 17 నెలల కూతురు ఉన్న హరీశ్ కుటుంబానికి విద్యుత్ శాఖలో రెగ్యులర్ ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

గణేశునికి ప్రత్యేక పూజలు



కథలాపూర్‌లో శివపార్వతుల కల్యాణం



మల్లాపూర్‌లో ఎస్సై దంపతులకు నిర్వాహకుల సన్మానం

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస శివారులోని సహస్ర లింగాల ఆలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు

రాయికల్: పట్టణంలోని పద్మశాలీ సేవా సంఘం, గౌడ సంఘ భవనంలో ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద శుక్రవారం మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని విజయసాయి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో ప్రతిష్ఠించిన గణనాథునికి శుక్రవారం కుంకుమపూజలు నిర్వహించారు

కోరుట్ల: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో వివిధ ఆకృతుల్లో నెల కొల్పిన గణనాథులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

మల్లాపూర్: మండల కేంద్రంలో రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో విఘ్నేశ్వరుడిని ఎస్సై రాజు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కథలాపూర్: కథలాపూర్‌లో యంగ్‌స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం భక్తులు శివపార్వతుల కల్యాణం జరిపించారు.

వెల్గటూర్: మండలంలో గణేశ్ నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని ఆదర్శ యూత్ వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు.

ఓటరు జాబితా అభ్యంతరాలపై సమావేశం

మల్యాల: ఓటర్ల జాబితాలో అభ్యంతరాలపై మండలంలోని వివిధ పార్టీల అధ్యక్షుడు, నాయకులతో మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం 12.30గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. వివిధ పార్టీల నాయకులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

రాయికల్ మండలంలో..

రాయికల్: మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో ఓటరు జాబితాలపై మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11.30 గంటలకు అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో చిరంజీవి తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్,జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో మిగిలిన సీట్లు భర్తీ చేయుటకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ బి లావణ్య తెలిపారు.

మాజీ సర్పంచ్ రక్తదానం

మేడిపల్లి: భీమారం మండల కేంద్రానికి చెందిన అల్లే గంగారాజు అనే మహిళకు ఆపరేషన్ నిమిత్తం రక్తం అవసరం కాగా, సోషల్ మీడియా వేదికగా విషయం తెలుసుకున్న భీమారం గ్రామ మాజీ సర్పంచ్ చెక్కపెల్లి అరుణ-రఘు జగిత్యాల ఆస్పత్రి వెళ్లి రక్తదానం చేసి ఆపదలో ఆదుకున్నాడు. రఘుని పలువురు అభినందించారు.

నేడు వాహనాల వేలం

జగిత్యాలక్రైం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం జిల్లా ప్రొహిబిషనరీ ఎక్సైజ్ అధికారి సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ తెలిపారు. ధరూర్ క్యాంప్‌లోగల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తి గలవారు పాల్గొనాలని పేర్కొన్నారు.

గణనాథులను దర్శించుకున్న ఎమ్మెల్యే

కొడిమ్యాల: మండల కేంద్రంలో వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహ మండపాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం జీవన్ రెడ్డి, కొండగట్టు ఉత్సవ కమిటీ సభ్యులు కోదూరి రాజేష్ జిల్లా యువజన అధ్యక్షుడు ముత్యం శంకర్,మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

జగిత్యాలరూరల్: మండలంలోని పొరండ్ల గ్రామానికి చెందిన పాడి రైతు పడిగెల శ్రీనివాస్‌రెడ్డి గతేడాది పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోగా కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీలో సభ్యత్వ నమోదు ఇన్సూరెన్స్ రూ.50 వేలు మంజూరు కాగా, శుక్రవారం కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ రాజేశ్వర్‌రావు మృతుడి భార్య లతకు చెక్కు అందజేశారు.

రాయికల్‌లో రైతు దినోత్సవం

రాయికల్: పట్టణంలోని భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు దినోత్సవం సందర్భంగా బలరాముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జోనల్ అధ్యక్షుడు రావుల లింగారెడ్డి, తిరుమల శంకర్, రైతులు ఎద్దండి లింగారెడ్డి, పాతూరి లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ



సర్టిఫికెట్లతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు

జగిత్యాలటౌన్: శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి పొందడమే కాకుండా తమ లాంటి మరెందరికో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని వీహెచ్‌పీ నాయకులు గుమ్ముల సత్యం అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు నెలల కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సత్యం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రాంత సేవా ప్రముఖ్ రాజేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్, నగర కార్యదర్శి జిట్టవేణి అరుణ్‌కుమార్, కోశాధికారి రాములు, సహకార్యదర్శి గాజోజు సంతోష్‌కుమార్, పాదం మహేందర్, శిక్షకురాలు కళావతి పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పొన్నాల గార్డెన్స్‌లో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు రూ.43 లక్షల విలువ గల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ రాంమోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు. మసీదుల పాలకవర్గానికి చెక్కులు అందజేశారు. అబ్దుల్ ఖాదర్, సుల్తాన్, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, గ్రంథాలయ డైరెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థినులు

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు జర ఫాతిమా డిస్కస్ త్రోలో, హరిక 1000మీటర్లలో, హర్షిత లాంగ్ జంప్‌లో, కీర్తన 60మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారని, ఈ నెల 30 నుంచి మహబూబ్ నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ మధులిక తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు,.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రుచిత

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బత్తుల రుచిత ఈనెల 21న నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటింది. 600 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అథ్లెటిక్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్యంరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్ పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించే పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

జగిత్యాల: ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ లత అన్నారు. శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు ఆస్పత్రులు కచ్చితంగా క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ, కొత్తగా ఆస్పత్రుల ఏర్పాటుకు 23 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో సర్టిఫికెట్లు లేని వాటిని రిజెక్ట్ చేయడం చేశామన్నారు. కొన్ని చోట్ల ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రారంభించారని, వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఐఎంఏ కోశాధికారి సుధీర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అలీ ఆరిఫ్‌ఖాన్, క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ పరిశీలకులు కుతుబుద్దీన్, ఎడ్యుకేటర్ శంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఆరాధ్యుడు బలరామదేవుడు

మల్లాపూర్: వ్యవసాయానికి ఆరాధ్యుడు బలరామదేవుడని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి అన్నారు. బలరామదేవుడి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద సంఘ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. 30 ఏళ్ల గల్ఫ్ దేశాలకు వెళ్లి వచ్చి మళ్లీ వ్యవసాయం చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న వృద్ధ రైతు చందా వెంకట్‌ను సన్మానించారు. మండల అధ్యక్షుడు కళ్లెం మహిపాల్‌రెడ్డి, పోచంపెల్లి రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మక గణపతులకు బహుమతులు

కోరుట్ల: పట్టణంలో నెలకొల్పిన గణపతి విగ్రహాల్లో సందేశాత్మక అలంకరణలకు బహుమతులు అందిస్తామని మున్సిపల్ కమిషనర్ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 6న గణేష్ నిమజ్జనం రోజు పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో తమకు కేటాయించిన నంబర్ల క్రమంలో చేరుకోవాలని, మొదట చేరుకున్న గణపతికి కన్సోలేషన్ బహుమతి ఇస్తామని తెలిపారు.

రాళ్లవాగు ప్రాజెక్ట్ కాల్వ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం కోనాపూర్ గ్రామాల మధ్య నక్కల ఒర్రె వద్ద రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులకు శుక్రవారం భూషణరావుపేట రైతులు ఫిర్యాదు చేశారు. కాలువను కోనాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ధ్వంసం చేసి నీరు వృథాగా పోయేలా చేశారని భూషణరావుపేట రైతులు ఆరోపిస్తున్నారు. కాలువను ధ్వంసం చేయడంతో భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల వైపు నీళ్లు రాని పరిస్థితి నెలకొందన్నారు. కాలువను ధ్వంసం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో భూషణరావుపేట గ్రామ రైతులు కోరారు.

మోడల్‌స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సంతోష్ శుక్రవారం తెలిపారు. 6వ తరగతిలో 43, 7వ తరగతిలో 47, 8లో 27, 9లో 10, 10లో 9, ఫస్ట్ ఇయర్‌లో 44, సెకండ్ ఇయర్‌లో 57 సీట్లు ఖాళీగా ఉన్నాయని, స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వ్యవసాయ దుకాణాల తనిఖీ

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని ఫర్టిలైజర్, రసాయన ఎరువుల దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి వడ్డెపల్లి భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువుల స్టాక్ పొజిషన్, స్టాకు వివరాలను పరిశీలించారు.

యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సతీశ్ రెడ్డి

మల్యాల: చొప్పదండి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నేరెళ్ల సతీశ్ రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మల్యాల మండల కో-ఆర్డినేటర్లుగా ముత్యంపేట గ్రామానికి చెందిన నల్ల సాయికిరణ్, తాటిపల్లి గ్రామానికి చెందిన సుర సాయి కృష్ణారెడ్డిని నియామకం కాగా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అల్లీపూర్‌లో 2కే రన్



రాయికల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 2కే రన్ నిర్వహించారు. క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం కిరణ్, పీడీ కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు రూ. 25 వేల పరిహారం అందించాలి



పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

సారంగాపూర్: భారీ వర్షాలు, వరదలకు బీర్‌పూర్ మండలంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేల పరిహారం అందించాలని మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలం రంగసాగర్ తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు రైతులతో కలిసి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఒక్క రంగసాగర్‌లోనే 140 ఎకరాల్లో వరి పంటకు, 50 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగి, ఇసుక మేటలు ఏర్పడి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం అధికారులతో క్షేత్రస్థాయిలో రైతువారిగా సర్వే జరిపించి, ఎకరాకు రూ. 25 వేల పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.